# షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



మాచారెడ్డిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆందోళనలు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న పార్టీ శ్రేణులు, రైతులు
- ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్

మాచారెడ్డి/బీబీపేట్/భిక్కనూరు/పెద్దకొడప్‌గల్/నిజాంసాగర్, ఆగస్టు 22 : ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా గురువారం రైతు ధర్నా నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంతోపాటు ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గ కేంద్రాలు, పలు మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేపట్టగా.. మాజీ ఎమ్మెల్యేలతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ధర్నాలో రైతులందరికీ రుణమాఫీ చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. నిజాంసాగర్‌లో నిర్వహించిన ధర్నాలో జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. రెండు లక్షల రుణ మాఫీని ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ సాధ్యమయ్యే హామీలు మాత్రమే ఇచ్చి పకడ్బందీగా అమలుచేశారని తెలిపారు. ధర్నాలో మాజీ ఎంపీపీ పట్లోల దుర్గారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, నాయకులు లక్ష్మీనారాయణ, సంగమేశ్వర్ గౌడ్, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం మాట్లాడారు. గ్రామాల్లో 30 శాతం మాత్రమే రుణమాఫీ అయ్యిందన్నారు. పంట రుణాలు తీసుకున్న వారికి ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్, కూచని శేఖర్, రమేశ్‌గౌడ్, గంగారెడ్డి, గడ్డం బాబు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. బీబీపేటలోని ప్రధాన చౌరస్తాలో మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలకు చెందిన రైతులతో కలిసి జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయకులు ధర్నా నిర్వహించారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో నిర్వహించిన రాస్తారోకోలో మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. రాస్తారోకోలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్ దేశాయ్, విండో చైర్మన్ హన్మంత్ రెడ్డి, నాయకులు సతీశ్ యాదవ్, తిరుమల్ రెడ్డి, బన్సీలాల్, రైతులు పాల్గొన్నారు.



పెద్ద కొడప్‌గల్‌లో రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు, రైతులు



భిక్కనూరులో బీఆర్ఎస్ నాయకుల ధర్నా



బీబీపేటలో..



నిజాంసాగర్‌లో..

## బ్యాంకు రుణాల్లో పురోగతి సాధించాలి

### కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఆగస్టు 22 : ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీలో పురోగతి సాధించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మండలాల వారీగా అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఐదు మహిళా శక్తి క్యాంటీన్లను 20 రోజు ల్లో ప్రారంభించాలని ఆదేశించారు. ఫీల్డ్ విజిట్ చేసి స్కీముల గ్రౌండింగ్‌కు బ్యాం కుల్లో సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. డిప్యూటీ డీఆర్డీవో మురళీ కృష్ణ, డీపీఎంలు రవీందర్‌రావు, సుధాకర్, రమేశ్‌బాబు, వకుళ పాల్గొన్నారు.

## ఒకే గ్రామానికి చెందిన ఇద్దరి అదృశ్యం



సరోజ



కాశీరాం

నస్రుల్లాబాద్, ఆగస్టు 22 : బీర్కూర్ మండలం వీరాపూర్ దుబ్బ గ్రామానికి చెందిన సరోజ(30) అదృశ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఈ నెల 20న భర్త పనికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో లేకపోవడంతో బంధువులు, చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు. అదే గ్రామానికి చెందిన కడమంచి పెద్ద కాశీరాం కూడా అదృశ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఈ నెల 20న ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడన్నారు. గురువారం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

**నిజాంసాగర్ మండలం బంజపల్లిలో యువతి..**

నిజాంసాగర్, ఆగస్టు 22: నిజాంసాగర్ మండలం బంజపల్లి గ్రామానికి చెందిన కడారి సవిత అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మెదక్ పట్టణానికి తన స్నేహితురాలు ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదని పేర్కొన్నారు. దీంతో యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు గురువారం తెలిపారు.

## ఏక రూప దుస్తులు పంపిణీ

భిక్కనూరు, ఆగస్టు 22 : మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న పలువురు క్రీడాకారులకు బీఆర్ఎస్ యువ నాయకుడు గంగళ రవీందర్ ఏకరూప దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనాథ్, పడి నర్సింహారెడ్డి, బండి ప్రవీణ్, వేణు, రాజు, భరత్ తదితరులు పాల్గొన్నారు.



ఏక రూప దుస్తులు అందజేసిన బీఆర్ఎస్ యువ నాయకుడు రవీందర్

## రైతు ధర్నాకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



నస్రుల్లాబాద్ నుంచి రైతు ధర్నాకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

నస్రుల్లాబాద్/నాగిరెడ్డిపేట, ఆగస్టు 22 : బాన్సువాడలో నిర్వహించిన రైతు ధర్నా కార్యక్రమానికి నస్రుల్లాబాద్ నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. నాయకులు గొడిసెల నర్సింహులు గౌడ్, సాయి కుమార్, అల్లం గంగారాం, శేఖర్, సాయిలు, అహ్మద్, మోసిన్ తదితరులు వెళ్లారు. ఎల్లారెడ్డి పట్టణంలో నిర్వహించిన ధర్నాకు నాగిరెడ్డిపేట నుంచి నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిద్ధయ్య, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కృష్ణ, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు దుర్గారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, సంతోష్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి, నారాయణ, వంశీగౌడ్ తదితరులు ఉన్నారు.

## 'ఇంటర్ విద్య జీవితానికి మలుపు'




మాట్లాడుతున్న ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాం

బాన్సువాడ, ఆగస్టు 22 : ఇంటర్ విద్య జీవితానికి మలుపు అని ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాం విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకున్న విద్యార్థులు నీట్, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించాలన్నారు. ప్రభుత్వ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శివకుమార్, అబ్దుల్ జలీల్, యాదాగౌడ్, స్వరూప్‌కుమార్, అబ్దుల్ హఫీజ్, మహ్మద్ ఇక్బాల్, నరేశ్, మహేశ్, దయానంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

బాన్సువాడ రూరల్/బీబీపేట్/లింగంపేట/ నాగిరెడ్డిపేట/నిజంసాగర్, ఆగస్టు 22 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని ఆర్డీవో రాథోడ్ రమేశ్ అన్నారు. బాన్సువాడ మండలం బోర్లం క్యాంపు, తాడ్కోల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన 'నాటుదాం ఒక మొక్క – అమ్మ పేరుమీదు' అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరున మొక్క నాటాలని సూచించారు. అనంతరం కళాశాలలో విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఏపీవో గంగాధర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణ, సీసీ శాదుల్లా, టీఏలు గోపాల్, సంతోష్, ఎఫ్ఏ ఆంజనేయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు. బీబీపేటలోని రోడ్డుకు ఇరువైలా ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, ఎంపీవో కృష్ణ మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. లింగంపేట మండల కేంద్రంలో ఎంపీడీవో నరేశ్, తహసీల్దార్ నరేందర్ మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ కోసం ఉపాధి కూలీలతో కంచెలు ఏర్పాటు చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మలహరి, అటవీశాఖ సెక్షన్ అధికారి భాస్కర్, బీట్ అధికారి ఫర్వీన్, ఆయా పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, కూలీలు పాల్గొన్నారు. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట గ్రామంలో ఎంపీడీవో గంగాధర్ మొక్కలను నాటారు. అనంతరం గ్రామంలోని వాటర్ లీకేజీలను పరిశీలించారు. ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని గ్రామ కార్యదర్శికి సూచించారు.

**అటవీశాఖ ఆధ్వర్యంలో..**

నాగిరెడ్డిపేట, ఆగస్టు22: మండలంలోని ధర్మారెడ్డి బీట్ పరిధిలోని మాల్తుమ్మెద అటవీశాఖ నర్సరీ వద్ద అటవీశాఖ అధికారులు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఎఫ్ఆర్వో వాసుదేవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌పేట ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో రవీందర్, బీట్ అధికారులు నవీన్, లవన్‌గౌడ్, పీఈటీ సబాత్‌కృష్ణ తదితరులు ఉన్నారు.




బోర్లం గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ఆర్డీవో రాథోడ్ రమేశ్



లింగంపేటలో మొక్కలు నాటుతున్న అధికారులు



అచ్చంపేటలో మొక్కను నాటుతున్న ఎంపీడీవో

## విద్యుత్ సిబ్బందికి సన్మానం



విద్యుత్ సిబ్బందిని సన్మానిస్తున్న గ్రామస్తులు

లింగంపేట, ఆగసు 22: మండలంలోని భవానీపేట గ్రామానికి నూతనంగా వచ్చిన లైన్‌మన్ పాండుతోపాటు జేఎల్ఎం నుంచి ఏఎల్ఎంగా ఉద్యోగోన్నతి పొందిన రాజును గ్రామస్తులు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పండరి, గ్రామస్తులు మహేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు..

నిజాంసాగర్, ఆగస్టు 22: మండలంలోని కోమలంచ గ్రామ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నాగరాజు(గూరుజీ), నర్సయ్య,శ్రీరామ్, మురళీధర్, విజయలక్ష్మి, ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, బషీర్, సరస్వతి, లక్ష్మి బదిలీపై వెళ్లారు. వారిని ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు గురువారం ఘనంగా సన్మానించారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

## తండాల్లో తీజ్ వేడుకలు



సోమార్‌పేటలో తీజ్ వేడుకల్లో యువతులు

మాచారెడ్డి, ఆగస్టు 22 : మండలంలోని సోమార్‌పేట, ఎల్లంపేట, కాకులగుట్ట తండా గ్రామ పరిధిలోని తండాల్లో గురువారం తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెండ్లికాని యువతులు గోధుమ విత్తనాల మొలకలను ఎత్తుకొని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యక్రమంలో ఆయా గ్రామాల తండా వాసులు పాల్గొన్నారు.

## వదలపర్తి జీపీ రికార్డుల తనిఖీ

నాగిరెడ్డిపేట, ఆగస్టు 22: మండలంలోని వదలపర్తి గ్రామ పంచాయతీని ఎంపీడీవో ప్రభాకర్ గురువారం సందర్శించారు. రికార్డులు, ఖర్చుల రశీదులను తనిఖీ చేశారు. గ్రామంలో ఉన్న సమస్యలు, ఇబ్బందులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. 'అమ్మ కోసం ఒక మొక్క'లో భాగంగా గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'డబుల్ ఇండ్ల'లో సౌకర్యాలు కల్పించాలి



సోమార్‌పేట్ లో డబుల్ బెడ్ రూం ఇండ్లను పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డి, ఆగస్టు 22: మండలంలోని సోమార్‌పేట్ గ్రామ శివారులో నిర్మించిన డబుల్ బెడ్ ఇండ్ల సముదాయంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆర్డీవో ప్రభాకర్ అధికారులకు సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సోమార్‌పేట్ గ్రామ శివారులో 300 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించగా..వాటిని గురువారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. డబుల్ బెడ్ రూం ఇండ్లకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ రాజ్ డీఈఈ గిరి, విద్యుత్ శాఖ ఏడీఈ సుధర్శన్‌రెడ్డి, తహసీల్దార్ మహేందర్ కుమార్, కాంట్రాక్టర్ తదితరులు ఉన్నారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎల్లారెడ్డి, ఆగస్టు 22: ఎల్లారెడ్డి మండలం గండిమాసానిపేట్ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి తండాకు చెందిన లంబాడి ప్రకాశ్ (30) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం ప్రకాశ్ పురుగుల మందు తాగగా.. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి సర్కారు దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ కలహాల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు.

## ఆలయంలో ప్రత్యేక పూజలు

బాన్సువాడ రూరల్, ఆగస్టు 22 : బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలోని ఆది బసవేశ్వర ఆలయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు గురువారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీధర్ ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

## జిల్లా వ్యవసాయాధికారిగా తిరుమల ప్రసాద్

కామారెడ్డి, ఆగస్టు 22 : కామారెడ్డి జిల్లా వ్యవసాయాధికారిగా తిరుమల ప్రసాద్ బదిలీపై వచ్చారు. ఇంతకుముందు కామారెడ్డి జిల్లా వ్యవసాయాధికారిగా పనిచేసిన భాగ్యలక్ష్మి కరీంనగర్ జిల్లా వ్యవసాయాధికారిణిగా బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో నిజామాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో డీడీఏగా పనిచేసిన తిరుమల ప్రసాద్ కామారెడ్డి జిల్లా వ్యవసాయాధికారిగా బదిలీపై వచ్చారు.

## బాయంపల్లి తండాలో వైద్య శిబిరం

లింగంపేట, ఆగస్టు 22: మండలంలోని బాయంపల్లి తండాలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. తండాకు చెందిన ఒకరు జ్వరంతో బాధపడుతూ మృతిచెందిన నేపథ్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు మండల వైద్యాధికారిణి హిమబిందు తెలిపారు. శిబిరంలో 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. వీరిలో ఐదుగురు జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి రక్త పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఇంటింటికీ తిరిగి జ్వర సర్వే చేపట్టి దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించినట్లు వివరించారు. మండల కేంద్రంలోని 5, 9వ వార్డుల్లోనూ జ్వర సర్వే నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఫరీదాబేగం, యాదగిరి, ల్యాబ్ టెక్నీషియన్ సుభాష్, లక్ష్మణ్, వైద్య సిబ్బంది రాజేశ్వరి, శాంత, మహమూద, ఆశ కార్యకర్తలు, తండావాసులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**వసతి గృహంలో..**

రామారెడ్డి, ఆగస్టు 22: రామారెడ్డి మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ వసతి గృహంలో మండల వైద్యాధికారి సురేశ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, 43 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్నవారికి మందులు అందజేశారు. పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి సూచించారు. హెచ్ఈ జార్జ్, సూపర్‌వైజర్ జానకి, వార్డెన్ జైపాల్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**PASSPORT LOST**

★ I, YATALAM GANGUBAI W/o. YATALAM SAYANNA R/o. H.No.1-117, Vill:Narayanapet, Mdl: Jakranpally, Dist.Nizamabad. నాయొక్క పాస్‌పోర్ట్ నెం.R5937637 గలది నారాయణపేట్ నుండి జక్రాన్‌పల్లికి బైక్ పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైన దొరికినచో సం|| సెల్: 9100632926

NTZ-340358

**WANTED**

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-325792

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-

GST వర్తించును

సెల్: 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.